క్లుప్తంగా

నేడు శ్రీలక్ష్మీ రామకోటి గీతా జ్ఞాన యజ్ఞం

నాంపల్లి : మండల కేంద్రంలోని శ్రీ భక్త మార్కెండేయ స్వామి ఆలయంలో బుధ, గురు వారాల్లో శ్రీలక్ష్మీ రామకోటి గీతా జ్ఞాన యజ్ఞం నిర్వహిస్తున్నట్లు యజ్ఞం ప్రచార కార్యదర్శులు కామిశెట్టి యాదయ్య, శ్రీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. యజ్ఞానికి ముఖ్య అతిథులుగా దయానందస్వామి, దేవానందగిరిస్వామి, శంకరానందగిరి, మాతానందగిరిస్వామి హాజరవుతారని పేర్కొన్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం కూడా చేపడుతున్నామన్నారు.

జిల్లా స్థాయి హాకీ జట్టుకు ఎంపిక



జనార్దన్‌ను అభినందిస్తున్న అధ్యాపకులు

చిట్యాల : పట్టణంలోని కేటీఎస్ విద్యార్థి ఓర్సు జనార్దన్ జిల్లాస్థాయి హాకీ జట్టుకు ఎంపికైనట్లు ఆ పాఠశాల పీఈటీ హుస్సేన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. త్వరలో రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా జట్టుకు జనార్దన్ ప్రాతినిధ్యం వహించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లా జట్టుకు ఎంపికైన విద్యార్థి జనార్దన్‌ను పాఠశాల డైరెక్టర్ కె. శ్రీధర్, ప్రిన్సిపాల్ బి.యాదగిరిగౌడ్ తోపాటు ఉపాధ్యాయులు అభినందించి, జ్ఞాపిక అందజేశారు.

మత్స్యకార్మిక దినోత్సవం

కేతేపల్లి : ప్రపంచ మత్స్యకార్మిక దినోత్సవాన్ని మండల కేంద్రంలో మత్స్యకార్మిక సంఘం నాయకులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మత్స్యకారులు జెండా ఎగురవేశారు. సంఘం అధ్యక్షుడు అమ్రోజు సైదులు, ఉపాధ్యక్షుడు జిలకల సైదులు, కార్యదర్శి బోనగిరి రామయ్య, దాసరి నాగరాజు, బోనగిరి వేణు, దాసరి సైదులు, యాదగిరి, దాసరి శ్రీను, శివ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీకి ఒక్క అవకాశం ఇచ్చి ఆదరించండి

నల్లగొండ టూటౌన్ : బీజేపీకి ఒక్క అవకాశం ఇచ్చి ఆదరించాలని కోరుతూ బీజేపీ అభ్యర్థి మాదగాని శ్రీనివాస్‌గౌడ్ మంగళవారం నల్లగొండ పట్టణంలోని 22వ రహమత్‌నగర్, బీటీఎస్ ప్రాంతంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. చింత ముత్యాల్‌రావు, దాసోజు యాదగిరాచారి, పెరిక మునికుమార్, ఏరుకొండ హరి, ఆవుల మధు, గణేశ్ పాల్గొన్నారు.

శ్రీనివాస్‌గౌడ్ సతీమణి ఇంటింటి ప్రచారం

మాదగాని శ్రీనివాస్‌గౌడ్‌ను గెలిపించాలని కోరుతూ ఆయన సతీమణి విజయలక్ష్మి నల్లగొండ పట్టణంలోని చర్లపల్లి, శివాజీనగర్ ప్రాంతాల్లో ఇంటింటి ప్రచారం చేశారు. రావెళ్ల కాశమ్మ, నేవర్సు నీరజ, భవాని, హైమావతి, తార, లలిత, సరిత తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే సమగ్రాభివృద్ధి

శాలిగౌరారం : కాంగ్రెస్ పార్టీతోనే సమగ్రాభివృద్ధి ప్రజాసంక్షేమం సాధ్యమని టీ పీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని పలు గ్రామాలలో మంగళవారం ఇంటింటి ప్రచారంలో ఆయన పాల్గొని మాట్లాడారు. చాడ సురేశ్‌రెడ్డి, గోదల నరేందర్‌రెడ్డి, చామల జయపాల్‌రెడ్డి, ఇటికాల చిరంజీవి, చింత ధనుంజయ్య, వేముల కుమార్, పడాల రమేశ్, వడ్లకొండ పరమేశ్, బొడ్డు నగేశ్, కంది సైదులు, కుంభం అశోక్, బట్ట లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మాలలకు సీట్లు ఇవ్వకపోవడం దారుణం

మర్రిగూడ : అసెంబ్లీ ఎన్నికల్లో మాలలకు సీట్లు కేటాయించకపోవడం దారుణమని దళిత రత్న అవార్డు గ్రహీత నాగిళ్ల మారయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో మాలల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కోరె సాయిరాం, స్వతంత్ర అభ్యర్థి కోర యాదయ్య, వీపీఆర్ పార్టీ అభ్యర్థి నూనె సురేష్, శ్రీకాంత్, మహిపాల్, ఈద అభి, సందేష్, వంపు చరణ్, ప్రవీణ్, రవి, కృష్ణ పాల్గొన్నారు.

ఓటు వేసిన 83 ఏళ్ల వృద్ధురాలు

నార్కట్‌పల్లి: మండలంలోని జువ్విగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని వెంకటేశ్వర బావికి చెందిన 83 ఏళ్ల వృద్ధురాలు మంగళవారం ఇంటి వద్దే పోస్టల్ బ్యాలెట్ ద్వారా తన ఓటు హక్కు వినియోగించుకుంది. ఎన్నికల సంఘం 80 ఏళ్లు దాటిన వృద్ధులకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఇంటి వద్దే ముందస్తుగా ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించింది. ఈ మేరకు ఎన్నికల అధికారులు స్వయంగా వెంకటేశ్వరబావికి వెళ్లి 83 ఏళ్ల వృద్ధురాలి ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరగా.. ఆమె బ్యాలెట్ పేపర్‌పై తన ఓటు వేసింది. అధికారులు బ్యాలెట్ పేపర్‌ను ఆమె చేత బ్యాలెట్ బాక్స్‌లో వేయించారు.



ఇంటి వద్దే ఓటు హక్కు వినియోగించుకుంటున్న వృద్ధురాలు

అభివృద్ధి చూసి ఓటు వేయండి

- నల్లగొండ నియోజకవర్గ అభ్యర్థి కంచర్ల భూపాల్‌రెడ్డి



పార్టీలోకి ఆహ్వానిస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి కంచర్ల భూపాల్‌రెడ్డి

రామగిరి(నల్లగొండ): తాను చేసిన అభివృద్ధిని పరిశీలించి ఓటు వేయాలని నల్లగొండ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కంచర్ల భూపాల్ రెడ్డి కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా జిల్లా కోర్టులో న్యాయవాదులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కంచర్ల భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ గత ఎన్నికలో తన గెలుపులో న్యాయవాదులు కీలకంగా వ్యవహరించారని అన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో న్యాయవాదులు తన గెలుపునకు సహకరించాలని కోరారు. న్యాయవాదుల సంక్షేమానికి హౌజింగ్ సొసైటీ ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి రాగానే న్యాయవాదుల సంక్షేమ నిధి రూ.100 కోట్ల నుంచి రూ.500 కోట్లకు పెంచుతామని కేటీఆర్ చెప్పారని అన్నారు. బీఆర్‌ఎస్‌తోనే సంక్షేమ పథకాల అమలు సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నేతి రఘుపతి, సెక్రటరీ జలిగల రవికుమార్, న్యాయవాదులు ఆదిరెడ్డి, గోలి అమరేందర్‌రెడ్డి, జి.వెంకటేశ్వర్లు, ఆవుల రాములు, లోడంగి గోవర్ధన్, సుంకరి మల్లేష్‌గౌడ్, కటికం సత్తయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కంచర్ల భూపాల్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిక

తిప్పర్తి మండలం నూకలవారిగూడెం గ్రామానికి వివిధ పార్టీల కార్యకర్తలు కందుల లక్ష్మయ్య ఆధ్వర్యంలో మంగళవారం నల్ల గొండ నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి కంచర్ల భూపాల్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో గుండెబోయిన రామచంద్రు, సైదులు, నాగరాజు, సిరసవాడ సైదులు, గుర్రం వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ వైపే క్రైస్తవ సమాజం

క్రైస్తవ సమాజం బీఆర్‌ఎస్ పార్టీ వైపే ఉందని నల్లగొండ నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి కంచర్ల భూపాల్‌రెడ్డి, తెలంగాణ క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ డి. రాజేశ్వరరావు అన్నారు. మంగళవారం నల్లగొండ పట్టణంలోని బిలీవర్స్ చర్చిలో నియోజకవర్గ పాస్టర్స్ అసోసియేషన్, క్రిస్టియన్ కౌన్సిల్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో జరిగిన



న్యాయవాదులతో మాట్లాడుతున్న కంచర్ల

పాస్టర్ల సదస్సులో కంచర్ల భూపాల్‌రెడ్డి, డి. రాజేశ్వరరావు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు ఐజక్‌రామ్, డేవిడ్, విజయ్, ప్రసాద్‌కుమార్, లాజరస్, జాన్ శాస్త్రి, రాజ్‌కుమార్, కట్ట మోజేస్, జయచందు, అనిల్‌కుమార్, జక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే గ్రామాల అభివృద్ధి



పార్టీలో చేరినవారితో కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి



ఓటు అభ్యర్థిస్తున్న కూసుకుంట్ల అరుణ

మర్రిగూడ : బీఆర్‌ఎస్ పాలనలోనే రాష్ట్రంలోని అన్ని గ్రామాలు అభివృద్ధి చెందాయని మునుగోడు నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి సతీమణి అరుణ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అరుణ మాట్లాడుతూ మునుగోడులో కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో కూసుకుంట్ల స్రవంతి, రంజాన్, జెడ్పీటీసీ పాశం సురేందర్‌రెడ్డి, రైతుబంధు కన్వీనర్ బచ్చు రామకృష్ణ, సర్పంచ్ నల్ల యాదయ్య, మండల అధ్యక్షుడు తోటకూరి శంకర్, కొలుకులపల్లి యాదయ్య, రాపోలు యాదగిరి, పగడాల రఘు, వట్టికోటి శేఖర్, రఘు, వెంకటయ్య, శ్రీను, యాదయ్య, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ ఎంపీటీసీ బీఆర్‌ఎస్‌లో చేరిక

మునుగోడు : మండలంలోని కొరటికల్ గ్రామానికి చెందిన సీపీఐ ఎంపీటీసీ మందుల లక్ష్మమ్మబీరప్ప సీపీఐకి రాజీనామా చేసి మంగళవారం బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఆయనతోపాటు వివిధ పార్టీలకు చెందిన పలువురు నాయకులు బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కర్నాటి స్వామి తదితరులు పాల్గొన్నారు.

'గిరిజనులంతా కేసీఆర్ వెంటే'

మర్రిగూడ : తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందని, గిరిజనులంతా కేసీఆర్ వెంటే ఉంటామని లంబాడి తడాఖా జేఏసీ నాయకుడు ఆంబోతు విజయ్ నాయక్ అన్నారు. మంగళవారం స్థానికంగా ఆయన మాట్లాడుతూ మునుగోడులో ఎమ్మెల్యే అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి గెలుపునకు గిరిజనులంతా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఆంబోతు శంకర్, రమావత్ గోపి, ఆంబోతు హన్మంతు, సంతోష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

మునుగోడు : కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్ జిల్లా కార్యదర్శి దండు యాదయ్య మంగళవారం కాంగ్రెస్‌లో చేరారు. ఆయనతోపాటు వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షుడు డేరంగుల వెంకటేష్, డేరంగుల శేఖర్ కాంగ్రెస్‌లో చేరారు. నారబోయిన రవి, పాల్వాయి చెన్నారెడ్డి, అనంత లింగస్వామి, వనం యాదయ్య, గోదాల శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాంపల్లి : మండలంలోని పలువురు బీఆర్‌ఎస్, బీఎస్పీ నాయకులు మంగళవారం ఎలుగోటి వెంకటేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో రాజగోపాల్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. మాజీ ఎంపీపీ దండిగా నాగమణి వెంకటయ్య, నాంపల్లి సర్పంచ్ పెరమాళ్ళ శైలజ తదితరులు కాంగ్రెస్‌లో చేరారు. వైస్ ఎంపీపీ పానగంటి రజినివెంకన్నగౌడ్, శీలం జగన్ మోహన్‌రెడ్డి, దోటి పరమేశ్ తదితరులు ఉన్నారు.

చండూరు(గట్టుప్పల్) : చండూరు సహకార సంఘం డైరెక్టర్ చెరుపల్లి ఆంజనేయులు, చండూరు మండల రైతు బంధు డైరెక్టర్ పెసరకాయల నర్సింహారెడ్డి మంగళవారం రాజగోపాల్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. దండు యాదగిరిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చెరుపల్లి సత్యనారాయణ, గ్రామశాఖ అధ్యక్షుడు సామల యాదయ్య, నామని బుచ్చయ్య, నామని జగన్నాథం పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు ఎంపిక

నల్లగొండ టూటౌన్ : ఉమ్మడి జిల్లా తైక్వాండో బాలికల ఛాంపియన్‌షిప్ పోటీల్లో నల్లగొండ పట్టణంలోని రెడ్డి హాస్టల్ గురుకుల పాఠశాల విద్యార్థులు విజయం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఉమ్మడి జిల్లా స్థాయి పోటీల్లో బాలికలు రెండు బంగారు పతకాలు, మూడు సిల్వర్ పతకాలు, 9 కాంస్య పతకాలు సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కత్తుల శంకరయ్య తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను మంగళవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో తైక్వాండో కోచ్ అంబటి ప్రణీత్ పాల్గొన్నారు.

చిత్తశుద్ధితో ఎన్నికల విధులు నిర్వర్తించాలి



జగదీశ్వర్‌ను సన్మానిస్తున్న టీఎన్‌జీవోస్ సభ్యులు

నల్లగొండటౌన్: ఉద్యోగులు చిత్తశుద్ధితో ఎన్నికల విధులు నిర్వర్తించాలని టీఎన్జీవోస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారం జగదీశ్వర్ అన్నారు. మంగళవారం టీఎన్జీవోస్ భవన్‌లో ఏర్పాటు చేసిన ఓటరు అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎన్నికలపై ఓటర్లకు అవగాహన కల్పించి ఓటు హక్కు వినియోగించుకునేలా కృషి చేయాలని ఉద్యోగులకు సూచించారు. అనంతరం సంఘం సభ్యులు మారం జగదీశ్వర్, కస్తూరి వెంకట్, కొండల్‌రెడ్డిలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవోస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కస్తూరి వెంకట్, రాష్ట్ర సహాధ్యక్షుడు కొండల్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్ నరసింహాచారి, వెల్లంకి మాధవి, నాగిళ్ల మురళి, ఎం శ్రవణ్‌కుమార్, కంచనపల్లి కిరణ్‌కుమార్, కే దయాకర్ రావు, మేడి జయరాం పాల్గొన్నారు.

ఆసరా పింఛన్ అందక లబ్ధిదారుల అవస్థలు

మర్రిగూడ : ఆసరా పింఛన్లు సకాలంలో అందక మండలంలోని పింఛన్‌దారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నెల 17 నుంచి 23 వరకు ఆసరా పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు డీఆర్‌డీఏ అధికారులు ఐదు రోజుల క్రితం ఉత్తర్వులు జారీ చేశారు. మంగళవారానికి కూడా పింఛన్లు అందకపోవడంతో లబ్ధిదారులు పోస్టాఫీసుల చుట్టూ తిరుగుతున్నారు. వచ్చిన లబ్ధిదారులకు నిత్యం రేపు ఇస్తామని పోస్టాఫీసు సిబ్బంది చెప్పడంతో చేసేదేమి లేక వెళ్లి మరుసటి రోజు రావాల్సిన పరిస్థితి నెలకొంది. గత మాసంలో కూడా ఇదే తంతు కొనసాగినట్లు పలువురు వాపోతున్నారు. మర్రిగూడ మండల వ్యాప్తంగా వృద్ధాప్య, వితంతువు, వికలాంగులు, చేనేత, కల్లుగీత, ఒంటరి మహిళలు పింఛన్లు పొందేవారు 5,585 మంది ఉన్నారు. ఆలస్యం జరగడకుండా పింఛన్లను పంపిణీ చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు. ఈ విషయమై ఎస్‌పీఎం వెంకన్నను వివరణ కోరగా పింఛన్ల నగదు అందలేదని, అందిన మరుసటి రోజు నుంచే పంపిణీ చేస్తామని తెలిపారు.

సైకిల్ యాత్ర



కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడాలని కోరుకుంటూ పెద్దపల్లికి చెందిన నీలా సంజయ్‌కుమార్ సైకిల్‌పై తిరుపతి యాత్ర చేస్తూ మంగళవారం నల్లగొండ మీదుగా వెళ్లారు. ఈ నెల 19న బయలుదేరానని.. 28 లోపు తిరుపతికి వెళతానని సంజయ్‌కుమార్ తెలిపారు రోజు 120 కి.మీ. వెళుతున్నట్లు పేర్కొన్నారు.

- సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నల్లగొండ

వందల కోట్లు తెచ్చి అభివృద్ధి చేశా

- నకిరేకల్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి చిరుమర్తి లింగయ్య

నకిరేకల్ : వందల కోట్లు తెచ్చి నకిరేకల్ మున్సిపాలిటీని అభివృద్ధి చేశానని.. అభివృద్ధి కొనసాగాలంటే మరోసారి తనను ఆశీర్వదించి గెలిపించాలని నకిరేకల్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి చిరుమర్తి లింగయ్య కోరారు. నకిరేకల్ మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో మంగళవారం ఆయన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటికి తిరిగి తనకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్, వైస్ చైర్‌పర్సన్ మురారిశెట్టి ఉమారాణి కృష్ణమూర్తి, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు యల్లపురెడ్డి సైదిరెడ్డి, వార్డు కౌన్సిలర్ గర్శకోటి సైదులు, గడ్డం స్వామి తదితరులు పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి : తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి బీఆర్‌ఎస్‌తోనే సాధ్యమని నకిరేకల్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి చిరుమర్తి లింగయ్య అన్నారు. మంగళవారం నార్కట్‌పల్లి మండలంలోని మాండ్ర గ్రామంలో జరిగిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ చిరుమర్తి లింగయ్యకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం అభ్యర్థిని గెలిపించాలి

కట్టంగూర్ : ప్రజల పక్షాన పోరాడే నకిరేకల్ నియోజకవర్గ సీపీఎం అభ్యర్థి బొజ్జ చిన వెంకులును భారీ మెజార్టీతో గెలిపించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు తుమ్మల వీరారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం కట్టంగూర్ మండలంలోని అయిటిపాముల, బొల్లేపల్లి, కట్టంగూర్, దుగినవెల్లి గ్రామాల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి పెంజర్ల సైదులు, చిలుముల రామస్వామి, మురారి మోహన్, లకపాక రాజు, జాల రమేష్, పందుల లింగయ్య, శ్రీనివాస్, రామకృష్ణ, శ్రీను, స్వామి తదితరులు పాల్గొన్నారు.

చలమల్ల కృష్ణారెడ్డి సమక్షంలో బీజేపీలో చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న కృష్ణారెడ్డి

మునుగోడు: మండలంలోని కిష్టాపురం గ్రామానికి చెందిన వివిధ పార్టీల నాయకులు మునుగోడు నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి చలమల్ల కృష్ణారెడ్డి సమక్షంలో మంగళవారం బీజేపీలో చేరారు. జాజుల నరేష్‌గౌడ్, మధు, వంశీ తదితరులు బీజేపీలో చేరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి వేదాంతం గోపీనాథ్, దేవిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, సురిగి నర్సింహగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గంగిడి మనోహర్‌రెడ్డి సమక్షంలో..

నాంపల్లి : మండలంలోని వడ్డెపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ వట్టికోటి సుధాకర్, యువజన నాయకుడు చాపల యాదయ్యతోపాటు పలువురు బీఆర్‌ఎస్ నాయకులు గంగిడి మనోహర్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

అప్పుల తెలంగాణగా మార్చిన కేసీఆర్

నార్కట్‌పల్లి : ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని బంగారు తెలంగాణ అంటూ బాధల తెలంగాణ, అప్పుల తెలంగాణగా మార్చారని నకిరేకల్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి వేముల వీరేశం అన్నారు. మంగళవారం నార్కట్‌పల్లి మండలంలోని చెర్వుగట్టు, దాసరగూడెం, యల్లారెడ్డిగూడెం గ్రామాల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఉషయ్య, మాజీ జెడ్పీటీసీ సత్తయ్య, మాజీ సర్పంచ్ కృష్ణ, సత్తిరెడ్డి, అచ్చాలు, శంకర్, పశుపతి తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ మాటలు ప్రజలు నమ్మరు

- కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



చందనపల్లిలో మాట్లాడుతున్న కోమటిరెడ్డి

నల్లగొండ : కేసీఆర్ మాయమాటలు నమ్మేందుకు నల్లగొండలో అమాయక ప్రజలు ఎవరూ లేరని నల్లగొండ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. మంగళవారం పానగల్, కేశరాజుపల్లి, శేషమ్మగూడెం గ్రామాల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు.

కోమటిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక

నల్లగొండ మండలంలోని బుద్ధారం, చందనపల్లి గ్రామాలకు చెందిన పలువురు బీఆర్‌ఎస్ కార్యకర్తలు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, నల్లగొండ జెడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య పాల్గొన్నారు.

కోమటిరెడ్డి సతీమణి, కూతురు ప్రచారం

కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ వెంకట్‌రెడ్డి సతీమణి సబిత, కూతురు శ్రీనిధి రెడ్డి నల్లగొండ పట్టణంలోని పలు వార్డుల్లో ఇంటింటి ప్రచారం చేపట్టి ఓట్లు అభ్యర్థించారు. గోపగాని మాధవి, కౌన్సిలర్లు గోగుల రాములమ్మ, కేసాని వేణుగోపాల్‌రెడ్డి, బుర్రి చైతన్య, పాదం అనిల్‌కుమార్, నాంపల్లి భాగ్య పాల్గొన్నారు.

కేసీఆర్ కుటుంబమే బాగుపడింది

నల్లగొండ రూరల్ : కొట్లాడి తెలంగాణ రాష్ట్రాన్ని సాధిస్తే కేసీఆర్ కుటుంబమే బాగుపడిందని కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. నల్లగొండ మండలంలోని ఖాజీరామారం, చందనపల్లి, చిన్నసూరారం, పెద్దసూరారం, దండంపల్లి, రెడ్డి కాలనీల్లో ఆయన ప్రజలనుద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, పెండెం పాండు రత్నమాల, సంకు ధనలక్ష్మి, పెద్దులు, అనంతరెడ్డి, పెద్ది గోవర్ధన్‌గౌడ్, మున్వరున్నీసా షబ్బీర్‌బాబా, నారబోయిన భద్రయ్య, ఎస్.కె. మహ్మద్ పాల్గొన్నారు

విచ్చలవిడిగా మద్యం విక్రయాలు!

- వ్యక్తులకు పరిమితికి మించి అమ్మకాలు
- పలు గ్రామాల్లో ఇంకా కొనసాగుతున్న బెల్టు షాపులు
- మద్యం పంపిణీ అరికట్టాలని కోరుతున్న మహిళలు



మునుగోడు : ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పటికీ మునుగోడులోని మద్యం వ్యాపారులు ప్రభుత్వం నిబంధనలు ఏమాత్రం పాటించడం లేదు. గ్రామాల్లో మద్యం ఏరులై పారుతోంది. మండలవ్యాప్తంగా ప్రతి గ్రామం నుంచి రోజుకు దాదాపు రూ.2 లక్షలకు పైగా మద్యం కొనుగోళ్లు జరుగుతున్నాయి.

బిల్లులు ఇవ్వకుండానే మద్యం విక్రయాలు..

వైన్స్‌షాపులో మద్యం కొనుగోలు చేసిన ప్రతి ఒక్కరికీ బిల్లు ఇవ్వాలి. కానీ కొనుగోలుదారులకు బిల్లు ఇవ్వకుండానే మద్యం విక్రయిస్తున్నారు. అంతే కాకుండా ఒక వ్యక్తికి 12 బీర్లు, 6 ఫుల్ బాటిళ్ల మద్యం మాత్రమే విక్రయించాలి. కానీ మునుగోడులోని మద్యం వ్యాపారులు నిబంధనలు ఏమాత్రం పాటించకుండా ఒక్కో వ్యక్తికి మూడు, నాలుగు కాటన్ల బీర్లు, లెక్కకు మించి లిక్కర్ ఫుల్ బాటిళ్లు విక్రయిస్తున్నారు. దీంతో ఏ గ్రామంలో చూసినా సాయంత్రం సమయంలో మద్యం ఏరులై పారుతోంది.

గుట్టుచప్పుడు కాకుండా బెల్టు దందా..

ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున స్థానిక పోలీసులు, ఎక్సైజ్ అధికారులు బెల్టు దుకాణాలను పూర్తిగా మూసివేయించారు. అయినా కొందరు వ్యాపారులు గుట్టుచప్పుడు కాకుండా రహస్య ప్రదేశాల్లో మద్యం దాచిపెట్టి అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నారు. వైన్స్ షాపులో పరిమితికి మించి మద్యం విక్రయించడం వల్లే ఇలా గుట్టుచప్పుడు కాకుండా బెల్టు దందా సాగుతుందనే విమర్శలు వస్తున్నాయి.

శాంతిభద్రతలకు విఘాతం కలిగే అవకాశం

వివిధ పార్టీల నాయకులు ఓటర్లకు నాలుగైదు రోజులుగా విచ్చలవిడిగా మద్యం పంపకాలు చేస్తుండడంతో ఆ మద్యం తాగిన ప్రజలు తగవులు పడుతున్నారు. ఉదయం సమయంలో ప్రచారం చేసిన కార్యకర్తలను ఒకేచోట కూర్చోబెట్టి మద్యం పోస్తుండడంతో ఒకరిపై మరొకరు విమర్శలు చేసుకొని తగువులు పడుతున్నారు. దీంతో శాంతిభద్రతలకు విఘాతం కలిగే ప్రమాదం ఉందని, గ్రామాల్లో మద్యం పంపిణీ పూర్తిగా అరికట్టాలని మహిళలు, సాధారణ ప్రజలు కోరుతున్నారు. అధికారులు చొరవ తీసుకొని ప్రభుత్వ నిబంధనల ప్రకారం వైన్స్ షాపుల యజమానులు మద్యం విక్రయాలు కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నిబంధనల ప్రకారం మద్యం విక్రయించాలి

ప్రతి మద్యం వ్యాపారి ప్రభుత్వ నిబంధనల ప్రకారం మద్యం విక్రయాలు కొనసాగించాలని ఆదేశించాం. ఒక వ్యక్తికి 12 బీర్లు, 6 ఫుల్ బాటిళ్ల మాత్రమే విక్రయించాలి. అంతే కాకుండా మద్యం కొనుగోలు చేసిన ప్రతి ఒక్కరికి బిల్లు ఇవ్వాలి. బిల్లు ఇవ్వని దుకాణాల యజమానులపై చర్యలు తీసుకుంటాం. బెల్టు దుకాణాల్లో మద్యం విక్రయిస్తే పట్టుకొని కేసులు నమోదు చేస్తున్నాం.

– అఖిల్, ఎక్సైజ్ ఎస్‌ఐ